# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1** **కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నియామక పత్రాలను దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు అందజేస్తారు.**

**2.** **పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3.** **భారతీయ సంస్కృతి వారసత్వానికి ప్రత్యేకమైన దేశభాషల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**

**4.** **అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.**

**5.** **తెలంగాణలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి వెల్లడించారు.**

==========================

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నియామక పత్రాలను దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు అందజేస్తారు. కొత్తగా ఉద్యోగాల్లో నియామక ప్రక్రియ పూర్తయిన వారు రైల్వే శాఖ, రక్షణ శాఖ, తపాలా విభాగం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆర్థిక సేవల విభాగం, కార్మిక, ఉపాధి కల్పన శాఖలతో పాటు ఇతర మంత్రిత్వ శాఖల్లోనూ, విభాగాల్లోనూ చేరనున్నారు. దేశవ్యాప్తంగా 47 చోట్ల 'రోజ్‌గార్ మేళా'ను ఈరోజు నిర్వహిస్తున్నారు.

-------------------------

పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కేంద్ర- రాష్ట్ర వస్తు సేవల పన్ను అధికారుల సమన్వయ సమావేశం నిన్న జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శవంతంగా ఉండాలని పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి లాంటి నగరాలు హైదరాబాదు లాగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

-------------------------

భారతీయ సంస్కృతి వారసత్వానికి ప్రత్యేకమైన దేశభాషల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు

చేపట్టినట్లు కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోని హైదరాబాదులో రాజ భాష విభాగం స్వర్ణోత్సవ వేడుకలు నిన్న నిర్వహించారు. మాతృభాషల స్థానాన్ని ఏ భాష భర్తీ చేయలేదనే విషయాన్ని ఎంతోమంది మహనీయులు చాటి చెప్పారని కేంద్ర మంత్రి గుర్తుచేస్తూ...

వాయిస్..29 సెకన్లు

---------------------------

తెలంగాణలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల 14న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి లో నిర్వహించే రేషన్ కార్డుల పంపిణీ సభ ఏర్పాట్లను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయాలను ఎలా ఆర్జించాలనే అంశాలపై దృష్టి సారించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదాయార్జన శాఖలపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంస్కరణల అమలు ద్వారా రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆదాయార్జన శాఖలు సొంతంగా ఆదాయాలు పెంచుకోవడం పైన దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలతో పాటు ఆయా నియోజకవర్గాలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషి వంటి అంశాలను మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు ప్రజలకు వివరిస్తున్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు.

---------------------------

సమాజంలో మార్పు కోసం ప్రజలను అన్ని విధాలుగా చైతన్యవంతం చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వారి ఆధ్వర్యంలో వార్తా లాప్ పేరుతో పాత్రికేయులకు మీడియా కార్యశాల నిన్న నిర్వహించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయాలు, పథకాల ఉద్దేశం ప్రజలకు చేరడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందని కలెక్టర్ వివరిస్తూ..

వాయిస్ 34 సెకన్లు

---------------------------

టెండూల్కర్–అండర్సన్ ట్రోఫీ లో భాగంగా లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ – ఇండియా మధ్య మూడో టెస్ట్ కొనసాగుతోంది. 251 పరుగుల నుంచి రెండో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇండియా రెండో రోజు ఆట ముగిసే సమయానికి 145 పరుగులకు 3 వికెట్లు నష్టపోయింది. కేఎల్.రాహుల్ 53 పరుగులు, పంత్ 19 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలో వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు తేలిక పాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..27 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద నీరు వచ్చి చేరుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. నిన్న సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 37.2 అడుగులు ఉండగా, ధవళేశ్వరం వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 2.9 లక్షల క్యూసెక్కుల ఉందని తెలిపారు. దీంతో మరింత వరద ప్రవాహం చేరే అవకాశం ఉండడంతో అల్లూరి సీతారామరాజు తూర్పుగోదావరి అంబేద్కర్ కోనసీమ కాకినాడ ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల అధికారులను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల అత్యవసర సహాయం కోసం 112,1070, నెంబర్లను సంప్రదించాలని కోరారు.

---------------------------

తెలంగాణలో ఉచిత బస్సు సేవల కోసం మరో మూడు వేల బస్సులు కొనేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఢిల్లీలో ఆయన పాత్రికేయుల సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రేషన్ కార్డు ఆధారంగానే రైతులకు రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాదులో మూసి నుంచి గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ పనులు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ డాక్టర్ ఎస్.అబ్దుల్ నజీర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న రాజ్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, పరిపాలన అంశాలను గవర్నర్ కు వివరించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం “క్యాచ్ ది రైన్” కార్యక్రమాన్ని చేపట్టింది. “ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం“ అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని ఈ ఏడాది మార్చి 22 నుండి నవంబర్ 30 వరకు నిర్వహిస్తోంది.

=====================